క్లుప్తంగా...

క్రీడల్లో రాణించాలి



విజేతలతో కీర్తిలత, వేణు తదితరులు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సినీ నిర్మాత బత్తిని కీర్తిలతగౌడ్ అన్నారు. మంగళవారం ఇండోర్ స్టేడియంలో 4 రోజులుగా మ్యాచ్‌పాయింట్ బాడ్మింటన్ అకాడమి ఆధ్వర్యంలో జరుగుతున్న పువ్వాడ ప్రసాద్ మెమోరియల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ముగిసింది. అండర్–15 బాలుర విభాగంలో గెలుపొందిన శౌర్య, బాలికల విభాగంలో గెలుపొందిన లక్ష్య సంహితలకు మెడల్‌ను అందజేశారు. అదేవిధంగా అండర్–11 బాలుర విభాగంలో గెలిచినటువంటి జతిన్, బాలికల విభాగంలో గెలుపొందిన అక్షర, డబుల్స్ విభాగంలో గెలుపొందిన శ్రీకుమార్, త్రినాథ్‌కు బహుమతులను అందజేశారు. మణికొండ కౌన్సిలర్ శ్రీకాంత్, మ్యాచ్‌పాయింట్ బాడ్మింటన్ అకాడమి అధినేత ముప్పాల వేణు తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



రాహుల్‌కుమార్‌ను సన్మానిస్తున్న బస్తీవాసులు

జియాగూడ: జియాగూడలోని వాల్మీకీనగర్‌లో కొన్ని సంవత్సరాలుగా పాడై ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి నూతనంగా ఏర్పాటు చేశామని జియాగూడ డివిజన్ బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు బగిడి రాహుల్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం నూతన విద్యుత్ స్తంభాలకు పూజలు చేయగా, బస్తీవాసులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, రాహుల్, సంజు, వినోద్, రాజేష్, సుందర్, టార్జన్, రజత్ పాల్గొన్నారు.

'అన్ని వర్గాల వారికి ఎమ్మెల్యే టికెట్లు కేటాయిస్తాం'



బోనాల శ్రీనివాస్‌తో చర్చిస్తున్న రాజేష్, కృష్ణమూర్తి తదితరులు

అఫ్జల్‌గంజ్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నామని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మహారాజ్ గంజ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజేష్, ప్రతినిధులు జేఎఎస్, కృష్ణమూర్తి బోనాల శ్రీనివాస్‌ను కలిసి రానున్న ఎన్నికలపై సామాజిక అంశాలపై చర్చించారు. అనంతరం బోనాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ పార్టీ సామాజిక న్యాయంతో ముందుకు వెళ్తూ అన్ని వర్గాలకు టికెట్లు కేటాయిస్తుందన్నారు. అతి త్వరలోనే తమ అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తామన్నారు.

సుందర్ రెడ్డి గెలుపునకు కృషి చేస్తాం



సామ సుందర్‌రెడ్డిని సన్మానిస్తున్న సాయిబాబా

గౌలిపురా: యాకుత్‌పురా నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్‌రెడ్డిని మంగళవారం బీఆర్ఎస్ నాయకులు కలిసి సత్కరించారు. సామ సుందర్ రెడ్డి గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా కృషి చేస్తామన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బొడ్డు సాయిబాబా, గౌలిపురా ప్రధాన కార్యదర్శి దేవేంద్ర, నాయకులు సంతోష్, నర్సింహగౌడ్, రాఘవేంద్ర, ఆనంద్ మోహన్ తదితరులు ఉన్నారు.

సన్మానం



ఎమ్మెల్యేను సత్కరించిన ఆశీష్‌కుమార్‌యాదవ్

అబిడ్స్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ ఘనంగా సత్కరించారు. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థిగా మరోసారి సీఎం కేసీఆర్ టికెట్ కేటాయించడంతో గోపీనాథ్‌ను ఆశీష్‌కుమార్‌యాదవ్ సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీఆర్ఎస్ పార్టీ మరోసారి 100కు పైగా స్థానాల్లో విజయం సాధించి తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు.

సమాజ అభ్యున్నతికి పాటు పడాలి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న లింబాద్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్

చార్మినార్: సాంకేతిక పరిజ్ఞానాన్ని సామాజిక శాస్త్రాలకు అన్వయించుకొని మానవ సమాజ అభివృద్ధికి పాటు పడాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య ఆర్.లింబాద్రి అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల రాజనీతిశాస్త్రం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల ఆధ్వర్యంలో జరగనున్న మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభ సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రూపు దిద్దుకుంటున్న కోర్సులలో చేరటం ద్వారా ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకొచ్చన్నారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.రవీందర్ మాట్లాడుతూ.. ఉస్మానియా విద్యాలయం సామాజిక శాస్త్రాల ప్రయోగశాలని అన్నారు. ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు ఆచార్య జి.హరగోపాల్ మాట్లాడుతూ.. సామాజిక సంక్షోభాలను నివారించే పరిశోధనలు జరగాలన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ... సమకాలీన అవసరాలను బట్టి సామాజిక శాస్త్రాల తీరు తెన్నులను మార్చుకోవాలన్నారు. తిరుపతి, డాక్టర్ భాస్కర్, డాక్టర్ శంకర్, డాక్టర్ విప్లవ్ దత్ శుక్లా, డాక్టర్ యాదయ్య, అనిల్, డాక్టర్ రాణి పాల్గొన్నారు.

జానపదం సమాజ వికాసానికి మూలం



మాట్లాడుతున్న వీసీ ఆచార్య తంగెడ కిషన్ రావు

నాంపల్లి: జానపదం సమాజ వికాసానికి మూలమని పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు అన్నారు. మంగళవారం తెలుగువర్సిటీ ఎన్టీఆర్ కళా మందిరంలో నిర్వహించిన ప్రపంచ జానపద కళల దినోత్సవానికి ఆయన హాజరై ప్రసంగించారు. త్వరలో బాచుపల్లి నూతన ప్రాంగణంలో తెలంగాణ జానపద కళోత్సవాలను నిర్వహించడానికి కృషి చేస్తామని ప్రకటించారు. తెలుగు వర్సిటీ జానపద కళల విభాగాధిపతి డాక్టర్ నీరడి లింగయ్య ఆధ్వర్యంలో సిందే రమేష్ గద్వాల బృందంచే తోలుబొమ్మలాట ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. షాద్‌నగర్ నుంచి వచ్చిన కడెం పెంటయ్య బృందంచే సాంప్రదాయ వీరముష్టి ప్రదర్శన మంత్రముగ్ధుల్ని చేసింది. వర్సిటీ ఆరుబయట ప్రాంగణంలో కోటయ్య బృందంచే గంగిరెద్దులాట ప్రదర్శన ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో జానపద కళల శాఖ విద్యార్థులచే వివిధ జానపద కళారూపాలను ప్రదర్శించారు.

ట్రాఫిక్ అధికారులు నిష్పక్షపాతంగా ఉండాలి



ఎమ్మెల్యే కౌసర్‌తో మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్‌గుప్తా

గోల్కొండ: ట్రాఫిక్ అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గోషామహల్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్‌గుప్తా మంగళవారం టోలిచౌకిలో ఎమ్మెల్యే కౌసర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా ఉండాలని అన్నారు. అంతే కాకుండా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా ప్రతిష్ఠమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. మరోవైపు అకారణంగా చిరువ్యాపారులను వేధించకూడదని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలకు లోబడి పని చేసే వారికి తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని ఆయన అన్నారు.

యాదవ హైయిర్ భవనానికి స్థలం ఇప్పించేందుకు కృషి



మంత్రి తలసానిని కలిసిన నందకిశోర్ వ్యాస్ బిలాల్, రహ్మత్‌బేగ్

అబిడ్స్: ఉత్తర భారతీయులైన యాదవ హైయిర్ సమాజ్ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం ఇప్పించేందకు కృషి చేస్తానని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో యాదవ హైయిర్ సమాజ్ నాయకులు, ఎమ్మెల్సీ రెహ్మత్‌బేగ్ మంత్రి తలసానిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంతో పాటు నగరంలో వేలాది మంది యాదవ హైయిర్ కులస్తులు ఉన్నారన్నారు. నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో అన్ని సంఘాలకు, కులాలకు మంత్రి తలసాని సహకారంతో వారి సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివచరణ్ హైయిర్, గోపాల్ చౌదరి, రాజారామ్ యాదవ్, ప్రీతమ్ యాదవ్, నందు యాదవ్, ఉమేష్ యాదవ్, మోతీలాల్ యాదవ్ పాల్గొన్నారు.

భాగ్యోదయం గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న గంటా చక్రపాణి

సుల్తాన్‌బజార్: ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ ఆధ్వర్యంలో మంగళవారం చాదర్‌ఘాట్‌లోని ఆది హిందూ భవన్‌లో పద్మశ్రీ ఎం బీ.గౌతమ్ రచించిన భాగ్యోదయం అనే గ్రంథావిష్కరణ కార్యక్రమం జరిగింది. తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ గంట చక్రపాణి హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. భాగ్యరెడ్డి వర్మ పేదల విద్య కోసం ఎంతో కృషి చేశారన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగర్‌కాలనీ: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలోని వివిధ ట్రేడులలో 3వ విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శాంతినగర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పసుపులేటి శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐటీఐలలో 2023, 24 విద్యాసంవత్సరానికి 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు వెబ్‌సైట్ http://iti.telangana.gov.in లో తమ దరఖాస్తులను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు శాంతినగర్ ఐటీఐలో సంప్రదించవచ్చు.

ఓటరు నమోదుపై అవగాహన

గోల్కొండ: ఓటరు నమోదుపై అవగాహన కలిగి ఉండాలని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో ఓటరు లిస్టులో పేరు నమోదుపై ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరూ ఓటు వినియోగించుకోవాలని అన్నారు. ఇంత వరకు ఓటరు లిస్టులో పేరు లేని వారు వారి వివరాలను తమకు అందజేస్తే తాము వారి పేర్లను ఓటరు లిస్టులో నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అశ్విన్, ప్రభుపూజారి తదితరులున్నారు.



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు దేవర వంశీ తదితరులు

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు



గోల్కొండ ఆషీర్‌ఖానాలో అలంలను దర్శించుకుంటున్న ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: ఇస్లామిక్ కేలండర్ ప్రకారం సఫర్ నెలలో అలంలకు ఆషీర్‌ఖానాలలో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. స్థానిక ముస్లింలే కాకుండా షియా ముస్లింలు అలంలు కొలువుదీరిన ఆషీర్‌ఖానాలకు భారీ ఎత్తున తరలివస్తున్నారు. అహ్మద్‌నగర్, మాసబ్‌ట్యాంక్, గోల్కొండ, టోలిచౌకి తదితర ప్రాంతాల్లోని ఆషీర్‌ఖానాలు భక్తులతో కిటకిటలాడాయి. గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ స్థానిక మైత్రి కమిటీ సభ్యులతో పలు ఆషీర్‌ఖానాలను సందర్శించి అలంలకు దట్టీలు సమర్పించారు.

ఘనంగా ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం



కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

గోల్కొండ: జి.నారాయణమ్మ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులతో పాటు కళాశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల పూర్వ విద్యార్థిని హిమశ్రీదేశాయ్ (ఫిక్సెల్ డాటూం) వ్యవస్థాపకురాలు, ప్రూమేక్స్ వ్యవస్థాపకురాలు సృజన పెనుగొండ, ఇంప్యూవ్ 10ఎక్స్ సహ వ్యవస్థాపకురాలు రేణుక చెల్లాలు హాజరై ప్యానలిస్టులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు కొనసాగించిన జైత్రయాత్రలోని వయ ప్రయాసలు వివరించారు. ఈ సందర్భంగా ప్రీఇంక్యుబేషన్ ప్రోగ్రామ్ గ్రాడ్యుయేట్‌లకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఐడియా ఖాన్ విజేతలకు బహుమతులు అకాడమిక్ డీన్ డాక్టర్ కె.రామలింగారెడ్డి నగదు బహుమతులను అందజేశారు.

శుభాకాంక్షలు

చార్మినార్: సీడబ్ల్యూసీలో ప్రత్యేక శాశ్వత ఆహ్వానితులుగా నియమితులైన మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదరం రాజనర్సింహను పాతబస్తీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేఎస్.ఆనంద్‌రావు, గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ తదితరులున్నారు.



దామోదరం రాజనర్సింహను సత్కరిస్తున్న కె.ఎస్.ఆనంద్‌రావు తదితరులు

'సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తా'



చార్మినార్: చార్మినార్ శాసనసభ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా రెండోసారి తనకు టికెట్ కేటాయించడంపై మహ్మద్ సలావుద్దీన్ లోధి పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో పాటు పలువురికి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఉదయం రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు, మేయర్ విజయలక్ష్మి తదితరులను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు.

'బీజేపీ, కాంగ్రెస్‌లను ప్రజలు నమ్మే స్థితిలో లేరు'



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మమతా గుప్తా, సంతోష్‌గుప్తా

అబిడ్స్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని నగర గ్రంథాలయ శాఖ డైరెక్టర్, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు మమతా గుప్తా పేర్కొన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు మరోసారి సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ప్రకటించడంతో బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌గుప్తాతో కలిసి మమతాగుప్తా ఆయనను సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంతో పాటు రాష్ట్ర నలుమూలలా 100 పైగా స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించి మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రగతి, అభివృద్ధి, సంక్షేమంతోనే బీఆర్ఎస్ గెలుస్తుందన్నారు.

క్రైస్తవులకు రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలి

నాంపల్లి: బీఆర్ఎస్ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో క్రిస్టియన్ మైనార్టీలకు ఒక సీటు కూడా కేటాయించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు జెరూసలేము మత్తయ్య పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం బీఆర్‌కే భవన్‌లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సీఈఓ వికాస్ రాజ్‌ను కలిసి రూల్ ఆఫ్ రిజర్వేషన్ల అమలును కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు పీవీ యోహాను, నేతలు మోజెస్, డానియేల్, మోహన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థికి సన్మానం



చాంద్రాయణగుట్ట: బీఆర్ఎస్ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం అభ్యర్థి ముప్పిడి సీతారాం రెడ్డి పార్టీ నాయకులు మంగళవారం కలిసి సన్మానించారు. కాంటెస్టెడ్ కార్పొరేటర్లు ఆకుల శ్రీనివాస్, రాఘవేందర్ రాజు, నాయకులు సాయిలు, మల్లేష్ యాదవ్, నరేష్ కుమార్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అందరం కలిసి కట్టుగా ఎన్నికల్లో పనిచేస్తామని పేర్కొన్నారు.

మిత్రకృష్ణకు సత్కారం



జియాగూడ: కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థిగా మిత్రకృష్ణ పేరు ఖరారు కావడంతో బీఆర్ఎస్ నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై ఆయనను సత్కరించారు. జియాగూడ డివిజన్ అధ్యక్షుడు నరహరి చారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కావూరి వెంకటేష్, శ్రీనివాస్‌గుప్తా, నర్సింమ, కిషోర్ కుమార్, ఉమేష్, మహేశ్వర్ కాంతిలాల్, మనోజ్ కుమార్, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి



పూజలు చేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే గోషామహల్, నాంపల్లి నియోజకవర్గాలతో పాటు అన్ని ప్రాంతాల్లో ఆలయాలు అభివృద్ధి చెందుతున్నాయని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కనకదుర్గ దేవి ఆలయంతో పాటు గోషామహల్ నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో శ్రావణమాసం బోనాల వేడుకల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని పండగలను బీఆర్ఎస్ ప్రభుత్వమే స్వయంగా చేపట్టడం దేశంలోనే రికార్డు అన్నారు. శివకుమార్, శేఖర్, శ్రీనివాస్‌చారి, మోహన్ పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ శిల్పిని

గౌలిపురా: మహిళలు తమ ఆరోగ్య పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య మహిళా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శిల్పిని సూచించారు. ఉందాబజార్ యూపీహెచ్‌సీ కేంద్రంలో కొనసాగుతున్న ఆరోగ్య మహిళా ప్రోగ్రామ్‌ను ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళలు పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు.

నాయకత్వ లక్షణాలను కలిగి ఉండాలి



చార్మినార్: విద్యాభ్యాసంతో పాటు చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలను కలిగి ఉండాలని దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. చార్మినార్‌లోని నారాయణ ఈ–టెక్నో స్కూల్‌లో మంగళవారం జరిగిన నాయకత్వ ప్రమాణమహోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాభ్యాసంతో పాటు వలు రంగాల్లో రాణించడానికి దృష్టి సారించాలన్నారు. ఎస్ఐ ఖాదర్ హుస్సేన్‌తో పాటు జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం బాలపరమేశ్వర్, ప్రిన్సిపాల్ శారద, తహీనియత్, కో–ఆర్డినేటర్స్ ఆజాద్, భవానీ, నూర్, షఫీ, వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



పార్టీ నాయకులతోఎమ్మెల్యే హరిష్ పూంజా

యాకుత్‌పురా: రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ ప్రవాస యోజన కార్యక్రమం, యాకుత్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి, కర్ణాటక బెల్తాన్‌గడి ఎమ్మెల్యే హరిష్ పూంజా సూచించారు. బీజేపీ ప్రవాస యోజన కార్యక్రమంలో భాగాంగా మంగళవారం ఆయన రెయిన్‌బజార్ డివిజన్‌లో పర్యటించారు. ముందుగా యాకుత్‌పురా ఈస్ట్ చంద్రానగర్‌లోని బీజేవైఎం నియోజకవర్గం కన్వీనర్ ఆర్. ఈశ్వర్ యాదవ్ ఇంట్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ఎన్నికల్లో చేప్పటాల్సిన అంశలపై చర్చించారు. మహేశ్వర్, ధీరాజ్‌లాల్ , నిరంజన్ యాదవ్, చంద్రశేఖర్, వీరేంద్రబాబు, శివచంద్రగిరి, జగన్‌మోహన్, పురుషోత్తం పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



డబీర్‌పురా: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగబౌలి ప్రాంతంలో మంగళవారం 65 ఏళ్ల గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి అదృశ్యం



చంద్ బాషా (ఫైల్)

గౌలిపురా: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ బాలుడు కనిపించకుండా పోయిన ఘటన భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నరేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. ఆమన్‌నగర్–బీ హిదాయత్ ఫంక్షన్ హాల్ ప్రాంతానికి చెందిన వహీద్ కుమారుడు చంద్ బాషా (9) ఈనెల 21న షాజహాన్ ఫంక్షన్ సమీపంలో చెత్త పారేయడానికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు భవానీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని పార్టీలు యువతను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఓసీ జాతీయ కౌన్సిల్ చైర్మన్ లోకేష్ నాయక్

సుల్తాన్‌బజార్: అన్ని పార్టీలు యువత రాజకీయాల్లో ప్రోత్సహించాలని యువశక్తి జాతీయ అధ్యక్షుడు, ఆల్ ఇండియా స్టూడెంట్ ఆర్గనైజేషన్ క్లబ్ (ఏఐఎస్ఓసీ) న్యూఢిల్లీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు లోకేశ్ నాయక్ కోరారు. మంగళవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో రాజకీయాల్లో యువతకు మొదటి ప్రాధాన్యమివ్వాలన్నారు. తెలంగాణ వైసీపీ ఇన్‌చార్జిగా ఏఐఎస్ఓసీ జాతీయ కౌన్సిల్ మెంబర్ బనావత్ రవీందర్ నాయక్‌ను నియమించారు. రాబోయే రోజుల్లో యువత భవిష్యత్ వైసీపీ సంస్థ చేతిలో ఉందన్నారు. ప్రవీణ్, చిరంజీవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.